క్లుప్తంగా

వాహనాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లిలో వాహనాలను ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన ఆర్సీ వెంట ఉంచుకోవాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇవ్వడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

చలో ఢిల్లీ మహాధర్నా పోస్టర్లు విడుదల



కోడేరు: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడారు. ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెంకటయ్య, కుర్మయ్య, రాములు, వెంకటస్వామి, మధు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

కల్వకుర్తి: మున్సిపాలిటీలోని కాంగ్రెస్ కౌన్సిలర్లు వైఆర్‌ఆర్ కాంప్లెక్స్ నిర్మాణంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన అంశాలన్నీ పూర్తిగా అవాస్తవమని మున్సిపల్ చైర్మన్ సత్యం శనివారం ఖండించారు. కౌన్సిలర్లు వారు నేరుగా వచ్చి కాంప్లెక్స్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఇస్తానని, అసత్య ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. కాంప్లెక్స్ నిర్మాణ సమయంలోనే చాలా మంది ఎన్నో ఫిర్యాదులు చేశారని, పూర్తిగా అనుమతులు తీసుకున్నాకే భవన నిర్మాణం జరిగిందని, అది వారంతా గుర్తుంచుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి విద్యార్థిని ఎంపిక



వైష్ణవి

కందనూలు: ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌లో జరిగిన 67వ ఎస్జీఎఫ్ అండర్ 17, చెస్ టోర్నమెంట్ కం సెలక్షన్లలో నాగర్‌కర్నూల్ క్రీడాకారిణి వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైష్ణవి ఈ నెల 18న మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీలో ఉమ్మడి జిల్లా తరఫున ఆడనుందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారిణి వైష్ణవిని, డీఈఓ గోవిందరాజులతో పాటు, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పాండు, జిల్లా ఎస్‌బీసీ సెక్రెటరీ ప్రసాద్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

పాత పెన్షన్ ప్రకటనపై హర్షాతిరేకాలు

అచ్చంపేట రూరల్: తెలంగాణ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేస్తామని శాసనసభలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రకటించిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నామని సీపీఎస్‌టీఈఏ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కమలేకర్ నాగేశ్వర్ రావు, సంఘం సభ్యులు శంకర్ రాథోడ్, మంద రమేష్, అస్రఫ్, రఘునాథ్ రెడ్డి, సతీశ్, జగదీష్, రాజేష్, లోకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్‌ను సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు ఏకతాటిపై నిలబడి విజయతీరాలకు చేర్చారన్నారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగుల పాలిట శాపంగా ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఇంత గొప్ప నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. అందరి జీవితాల్లో వెలుగులు నింపే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు సిద్ధమైన సీఎం రేవంత్ రెడ్డికి యావత్ తెలంగాణ సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పాలనా రంగంలో పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



క్రాంతికుమార్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ , జిల్లా కార్యదర్శి శంకర్‌ల ఆధ్వర్యంలో శనివారం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాక్, ఉపాధ్యక్షులు వసంత, కోశాధికారిగా చంద్రమౌళి, మండల కార్యదర్శులుగా నరేందర్, రాఘవేందర్, శివకుమార్, మంజుల, యాదగిరి స్వతంత్ర్య కన్వీనర్‌గా నాగరాజులు, అకాడమిక్ కన్వీనర్‌గా మహేష్, మహిళా కన్వీనర్‌గా ప్రగతి, సాంస్కృతిక క్రీడా కన్వీనర్‌గా జాను, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా రాజేశ్వర్, కేజీబీవీ కన్వీనర్‌గా శాలాభేగం, జటప్రోలు కాంప్లెక్స్ కన్వీనర్‌గా సాయి మాతలను ఎన్నుకున్నారు.

నత్తనడకన నిర్మాణాలు

- నెరవేరని 'మన ఊరు-మన బడి' లక్ష్యం
- పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల



లింగాల ప్రాథమిక పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణాలు

లింగాల: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఊరు-మన బడి' పథకం మండలంలో ఆశించిన స్థాయిలో అమలు కావడంలేదు. అప్పట్లో ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన పథకం పూర్తి స్థాయిలో ముందుకుసాగకపోవడంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కరువై ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తరగతి గదుల నిర్మాణాలతో పాటు తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించడమే పథకం ఉద్దేశం. కాని మండలంలో ఎంపిక చేసిన ఏ ఒక్క పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపడలేదు. చేసిన పనులకు ప్రభుత్వం దశల వారీగా చెల్లించే బిల్లులు రాకపోవడంతో పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

మండలంలోని పాఠశాలలు

మండలంలో 2 ఉన్నత పాఠశాలలు, 18 ప్రాథమిక, మరో 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4 ఆశ్రమ పాఠశాలలు, 5 ప్రభుత్వ గిరిజన పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, మినీ గురుకులం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బీసీ గురుకుల పాఠశాల ఉన్నాయి.

పథకం అమలుకు 10 పాఠశాలలు ఎంపిక

పథకం అమలులో భాగంగా మొదటి దశలో 10 పాఠశాలలు ఎంపికయ్యాయి. లింగాల ఉన్నత పాఠశాలతో పాటు యూపీఎస్ చెన్నంపల్లి, అప్పాయపల్లి, అంబట్‌పల్లి, సూరాపూర్, దత్తారం, కొత్తకుంటపల్లి, మగ్దూంపూర్, అవుసలికుంట, లింగాల పాఠశాలలను ఎంపిక చేసి పనులను ప్రారంభించారు. కాగా పలు పాఠశాలలో భవన నిర్మాణాల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



లింగాల ఉన్నత పాఠశాలలో తరగతి గదులు ఇలా..

కనీస సౌకర్యాలు కరువై ఇబ్బందులు

పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పథకాన్ని ప్రారంభించిన సమయంలో ఇక తమ ఇబ్బందులు తొలగుతాయని విద్యార్థులు ఎంతగానో ఆశించారు. కాని చివరకు నిరాశే మిగిలింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

> **బిల్లులు రాకపోవడంతో**
>
> 'మన ఊరు-మన బడి' పథకంలో మొదటి దశలో 10 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో కాంట్రాక్టరు పనులు చేపట్టారు. కాని నెలలు కావొస్తున్నా.. బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తి స్థాయిలో అమలు కాలేదు. కొన్ని పాఠశాలల్లో గుత్తేదారులు అర్ధంతరంగా పనులు నిలిపివేసిన మాట వాస్తవమే. బిల్లులు విడుదలైన వెంటనే తిరిగి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీనివాసులు, పీఆర్ ఏఈ, లింగాల

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగామోహన్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధిహామీలో చేపట్టే పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగామోహన్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఉపాధి హామీ పనులపై ఆయా గ్రామాల క్షేత్రసహాయకులతో సమీక్షించారు. గ్రామసభల ద్వార ఎంపిక చేసిన పనులపై కూలీలకు అవగాహన కల్పించి 100 నుంచి 150 వరకు ప్రతి గ్రామంలో కూలీలను పెంచి పనులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏపీఓ ప్రవీణ్, ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి



వీఓఏలు, సీసీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం నిరంజన్

తెలకపల్లి: మహిళా సంఘాల్లో బ్యాంకుల ద్వార తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించుకునేలా వీఓఏలు మహిళా సభ్యులకు అవగాహన కల్పించాలని ఏపీఎం నిరంజన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలోని మండల మహిళా సమాఖ్య పరిధిలో ఉన్న 32 గ్రామసంఘాల వీఓఏలు, గ్రామసంఘం అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలు అర్హతను బట్టి సభ్యురాలు కావాల్సిన వనరులను, ఈపీపీఆర్‌పీ గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక ద్వార ఎస్‌ఆర్‌ఎల్‌ఎం సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. కస్టమర్ హైరింగ్ సెంటర్ మండల సమాఖ్యలో ట్రాక్టర్ సాయంతో తక్కువ ధరకు పొలం దున్నుకోవడానికి ఉందని, పేద మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు. స్త్రీనిధిలో తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో వందశాతం రికవరీ చేయాలన్నారు. బ్యాంకు నుంచి మహిళలకు ఇచ్చేందుకు సంవత్సరానికి 508 సంఘాలకు టార్గెట్ రూ.18.60 కోట్లు ఇప్పటి వరకు ఇచ్చామని, 196 సంఘాలకు రూ.16.27కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. ఈ డిసెంబర్‌లో వందశాతం పూర్తిచేయాలని వీఓఏలకు, సీసీలకు సూచించారు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘంలోకి నిరుపేదలను చేర్చాలని, దివ్యాంగులను సంఘాలుగా తయారు చేయాలన్నారు. సమావేశంలో ఐకేపీ సీసీలు నిరంజన్, సుజాత, సుకునయ్య, వీఓఏలు రాజునాయక్, సుధా, ఖాజాజీ, గిరిజ, అరుంధతి, ఉమ, పర్వత్ భేగం, రజిత, రేణుక, నాగలక్ష్మి, విజయ, బాబు పాల్గొన్నారు.

ప్రమాద బీమా తప్పనిసరి



జూపల్లిలో ప్రమాద బీమా చెక్కు

చారకొండ: నేటి సమాజంలో ప్రతిఒక్కరూ ఎంతో బిజీగా తమ జీవితాన్ని గడిపేస్తున్నారని, మన కుటుంబానికి ఆసరాగా ప్రతిఒక్కరికీ ప్రమాద బీమా తప్పనిసరి ఉండాలని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ వానరసి రంజిత్ అన్నారు. మండలంలోని జూపల్లిలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ప్రమాద బీమా నుంచి మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం బ్యాంకు మేనేజర్ శివప్రసాద్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ రంజిత్, నోడల్ అధికారి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ కుటుంబ భద్రత కోసం ప్రమాదాల బారీ నుంచి నష్టపోకుండా బీమా సౌకర్యాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీజీవీబీ ఖాతాదారులైన జూపల్లికి చెందిన మహ్మద్ బిలాల్, చంద్రాయన్‌పల్లికి చెందిన గడ్డమీది వెంకటయ్య ఇటీవల కొంత కాలం కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారికి బ్యాంకులో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.1,000 ప్రీమియం పాలసి చెల్లిస్తున్నారు. దీంతో బ్యాంకు అధికారులు నామినీకి ప్రమాద బీమా నుంచి రూ.20 లక్షల చొప్పున రూ.40 లక్షల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులు హలీమా, సైదమ్మలకు అందజేశారు. బ్యాంకు మేనేజర్ శివప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ జయ, నవీన్, క్యాషియర్ సంపత్, వెంకటయ్య యాదవ్, బాలేమియా ఉన్నారు.

ఖాళీ ఆటోలతో ర్యాలీ

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నందుకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో ఆటో యజమానులు ఆటోలతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం అమలు చేయడంతో, తమకు గిరాకీ లేక అవస్థలు పడుతున్నామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు అడ్డాలో ఉండి ఖాళీగా ఇళ్లకు పోతున్నామని వాపోయారు. కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని విచారం వ్యక్తం చేశారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం విషయంలో ప్రభుత్వ పునరాలోచన చేయాలని కోరారు.



లింగాలలో ఖాళీ ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

జైహో జాతీయ సమ్మేళనం విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: మత సామరస్యమే లక్ష్యంగా మత విద్వేషానికి వ్యతిరేకంగా జైహో పని చేస్తుందని జైహో జై భారత్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్ అన్నారు. డిసెంబర్ 19న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో జరిగే జైహో 2వ జాతీయ సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద విడుదల చేశారు. సమ్మేళనానికి పలు రాష్ట్రాలకు సంబంధించిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో గ్రహదోష నివారణ పుజలు



శనేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామ జైష్ఠాదేవి సమేత శనేశ్వరాలయంలో శనివారం శని గ్రహదోష నివారణకు స్వామి వార్లకు భక్తులు తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో గోత్ర నామార్చన, శనిదోష నివారణ మంత్రోచ్ఛరణ, ప్రదక్షిణలు వంటివి నిర్వహించారు. అనంతరం భక్తులు బ్రహ్మసూత్ర శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం



అంబట్‌పల్లిలో విగ్రహాలను ఊరేగిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

లింగాల: మండల కేంద్రంలోని అంబట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే వివిధ విగ్రహమూర్తుల ప్రతిష్టాపన ఉత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. మఠాధిపతులు కోటేశ్వరస్వామి, శశిభూషణ సిద్ధాంతి ఆధ్వర్యంలో మొదటి రోజు ఆలయం ఆవరణలో అనేక దైవ కార్యక్రమాలు నిర్వహించారు. గోపు, గణపతి పూజలు, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, నాందీ, అగ్ని ప్రతిష్టాపనం, హోమాలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం కోలాహలం మధ్య ప్రతిష్టించే విగ్రహాలను గ్రామంలోని వీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను జలాధివాసం చేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తులు



యాదిరెడ్డిపల్లిలో రైతుబంధుకు దరఖాస్తులు తీసుకుంటున్న ఏఓ సాయిరమేష్

కోడేరు/ తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సాయిరమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి రైతువేదికల్లో రైతుల నుంచి రైతుబంధు కోసం దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించి 440 మంది రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులందరూ రైతుబంధు కోసం దరఖాస్తులు ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలన్నారు.

సరుకుల పంపిణీ



మల్లాపూర్ పెంటలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంత చెంచు పెంటల్లోని చెంచులకు యస్కే ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్ పెంటల్లోని సుమారు 120 కుటుంబాలకు బియ్యం, పప్పులు, మంచినూనె, చింతపండు, మిర్చి పొడర్ తదిత ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. అదే విధంగా శీతాకాలం కావడంతో చలి నుంచి కాపాడుకునేందుకు గానూ ప్రతి కుటంబానికి ఒకటి చొప్పున రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సత్తయ్య, భరత్, బాలయ్యతో పాటూ తహసీల్దార్ శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ రవూఫ్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క బాలకిష్టయ్య, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఊర్కొండ: మండలంలోని అమ్మపల్లితండాకు చెందిన నిరుపేద రాంజీయ కూతురు రోజ వివాహానికి జకినాలపల్లి సర్పంచ్ అనిల్‌రెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.



హోమం నిర్వహిస్తున్న సర్పంచ్ దంపతులు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు చేశారు. ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఆలయంలో అఖండ భజన చేశారు. పూజా కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు అరుణ్‌రావు, నరేందర్‌రెడ్డి, జగదీష్, కృష్ణమనాయుడు, వేణాచారి పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత



అదృశ్యమైన బాలికలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తెలకపల్లి: కనిపించకుండా పోయిన బాలికలను పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మండల పరిధిలోని గౌరారానికి చెందిన మేకల నాగరాజు, లక్ష్మీదేవి దంపతులకు చెందిన ఇద్దరు కుమార్తెలు భాగ్యమ్మ, హైమావతి ఆగస్టు 20న ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో ఆగస్టు 22న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వసురాంనాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికలు తమకు తల్లిదండ్రులు లేరని చెప్పడంతో నాగర్‌కర్నూల్‌లో బొమ్మలు అమ్ముకునే వ్యక్తులు వారి వెంట హైదరాబాద్ తీసుకెళ్లారు. ఇటీవల బొమ్మలు అమ్మే వ్యక్తులు వారి సొంత ఊరికి వెళ్లిపోవడంతో ఉప్పల్‌లోనే బస్టాండ్ వద్ద తిరుగుతున్న బాలికలను ఓ ఆటో డ్రైవర్ గుర్తించి వారిని చేరదీశాడు. భువనగిరి వద్ద ఆరెపల్లికి తీసుకెళ్లి ఆశ్రయమిచ్చారు. చిన్న బాలికను పాఠశాలలో చేర్పించేందుకు శుక్రవారం తీసుకెళ్లగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్తి వివరాలు సేకరించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వారని గుర్తించి చైల్డ్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. నాగర్‌కర్నూల్ అధికారులకు సమాచారం అందించడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలు సేకరించి శుక్రవారం సాయంత్రం భువనగిరికి వెళ్లి అదృశ్యమైన పిల్లలను తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. పిల్లలను విచారించగా.. మనసు బాగోలేక ఇంటి నుంచి వెళ్లిపోయామని చెప్పారు. దీంతో శనివారం సాయంత్రం బాలికలిద్దరిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదకరంగా రోడ్డు గుంత



కల్వర్టుపై ఏర్పడిన గుంత

తాడూరు: మండలంలోని మేడిపూర్ నుంచి పోలుమూరు, గుట్టలపల్లి, నడిగడ్డ మీదుగా తెలకపల్లికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు పోలుమూరు సమీపంలో ఉన్న కల్వర్టుపై గుంత ఏర్పడి ప్రయాణం ఆందోళన కలిగిస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని కల్వర్టు కిందిభాగాన వేసిన పైపులకు రంధ్రాలు పడ్డాయని, రాత్రివేళ ప్రయాణం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మట్టితో నింపడంతో మరింత ఇబ్బంది ఏర్పడిందని ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

తాగునీటి బోరు లీకేజీ



గోదల్ వద్ద రహదారి పక్కన లీకేజీ ఇలా..

బల్మూర్: ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి బోరు వద్ద లీకేజీతో నీరు వృథా అవుతున్నా.. పట్టించుకోవడంలో పంచాయతీ వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని గోదల్ గ్రామ సమీపంలో తుమ్మెన్‌పేట- అచ్చంపేటకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న రక్షిత తాగునీటి సరఫరా బోరు వద్ద సగం నీరు లీకేజీ అవుతుంది. ప్రధాన రహదారిపై వచ్చిపోయే వాహన చోదకులపైకి నీళ్లు పడుతున్నాయి. దీంతో నీటి వృథాతో పాటు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి నిత్యం ఇది చూస్తున్నా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, వాహనచోదకులు మండిపడుతున్నారు.

కల్వకుర్తిని జిల్లా కేంద్రం చేయాలి

కల్వకుర్తి రూరల్: జి ల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్న కల్వకుర్తిని జి ల్లా కేంద్రంగా చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బాబీదేవ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగా కల్వకుర్తికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ప్రాంత వాసి రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని, ఈ ప్రాంతం అభివృద్ధికి కృషిచేయడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కేంద్రంగా మారితే విద్యా, వైద్యం, అవకాశాలతో పాటు అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. అన్ని పార్టీల నాయకులు అభ్యుదయవాదులు ఆలోచించాలని కోరారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యంపై కేసు నమోదయినట్లు ఎస్‌ఐ మహేందర్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన జ్యోతికి మతిస్థిమితం సరిగా లేదు. దీంతో కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఏర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆరు నెలలుగా తన తల్లి ఊరయిన ఖిల్లాఘనపూర్ మండలం మానిజిపేటలో ఉంచారు. ఈ నెల 14న జ్యోతి జిల్లా కేంద్రంలోని భర్త ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయింది. ఇంటికి తిరిగిరాకపోవడంతో భర్త చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. సంఘటనకు సంబంధించి భర్త మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.